క్లుప్తంగా

తొలగిన ముసుగు



డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన తీడా శ్రీను

దెందులూరు: ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో గ్రామాల్లో విగ్రహాలకు ముసుగులు తొలిగాయి. సీతంపేటలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి ఎన్నికల సందర్భంగా వేసిన ముసుగు తీసివేసి వైఎస్సార్‌సీపీ నాయకులు తీడా శ్రీను పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు.

మాజీ ఎంపీటీసీ సుబ్బారావు కుటుంబానికి పరామర్శ



సుబ్బారావుకు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ బాబ్జి

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం పట్టిన్నపాలెంలో మాజీ ఎంపీటీసీ బందారు సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. సుబ్బారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సుబ్బారావు కుమారుడు నాగార్జునరావుని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గం పరిశీలకుడు జెట్టి గురునాథ రావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, నాయకులు పసుపులేటి నాగార్జునరావు, పోల్నాటి శ్రీనివాసరావు, ముప్పిడి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించాలని వినతి

జంగారెడ్డిగూడెం: ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇచ్చి పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కమిటీ ఉపాధి హామీ అధికారులను డిమాండ్ చేసింది. సోమవారం ఆ సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఈమేరకు ఎంపీడీవో కేవీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం జీవరత్నం మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ కూలీలకు గత 60 రోజుల నుంచి పనులు చేస్తున్నా పే స్లిప్పులు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఏ పోలవరం, తాడువాయి, వేగవరం గ్రామాల్లో ఉపాధి పని చేసే చెరువుల్లో యంత్రాలతో రాత్రులు మట్టి తోలకాలు తోలుతున్నారని పలుమార్లు ఏపీవోకు విన్నవించినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే చేసిన వేతన బకాయిలు లక్షల రూపాయలు కూలీలకు అందక ఆకలితో అలమటిస్తున్నారని, గ్రామాల్లో పని కావాలని అడుగుతున్న కూలీలకు పని కల్పించడం లేదని వాపోయారు. కూలీలు జాబు కార్డులు కావాలని దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కంప్యూటర్లు పనిచేయటం లేదనే సాకుతో కాలం గడుపుతూ కూలీల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు. తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే మండలంలోని ఉపాధి హామీ కూలీలను ఐక్యం చేసి ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన ఉపాధి హామీ అధికారులను హెచ్చరించారు.

వైభవంగా గంగానమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: దెందులూరు గౌడవీధిలోని గంగానమ్మ తల్లి 9వ ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో ఆలంకరణ, పూజలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో మహా అన్నదానం నిర్వహించారు.

సాల్వేషన్ ఆర్మీ చర్చిలో చిన్నారులకు శిక్షణ

దెందులూరు: దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చిలో విరామ బైబిల్ స్కూల్ శిక్షణ తరగతులు స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య ప్రారంభించారు. విద్యార్థులకు చరిత్ర, వాఖ్య కంఠస్థం తదితర అంశాల్లో విరామ బైబిల్ స్కూల్లో ప్రత్యేక తరగతుల్లో శిక్షణనిస్తామని తెలిపారు. చిన్నారులు ప్రాథమిక స్థాయి నుంచి క్రమశిక్షణ, దేవునిపై భక్తితో జీవన విధానం కొనసాగితే అన్ని రంగాల్లో ఎంచుకున్న లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతారన్నారు. విరామ బైబిల్ స్కూల్‌కు కోర్ పరిధిలోని చిన్నారులు తరగతులకు హాజరయ్యారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

దెందులూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పోతునూరు గ్రంథాలయంలో 24 మందికి 21 రోజులు శిక్షణనిచ్చామని గ్రంథాలయాధికారి జి.రాంబాబు అన్నారు. చెస్ ఆడటం, పేపరు పఠనం, నీతి కథలు చెప్పడం తదితర అంశాలపై వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులకు శిక్షణిచ్చామని తెలిపారు. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు ఆసక్తిగా హాజరయ్యారని, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించారన్నారు. 24 మంది చిన్నారులకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఇచ్చిన సర్టిఫికెట్లను గ్రంథాలయాధికారి అందజేశారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- పప్పు దినుసులదీ అదే దారి
- ప్రజలపై పెను భారం



ఉంగుటూరులో వారపు సంత



కూరగాయల దుకాణం

ఉంగుటూరు: కూరగాయల ధరలు ఆకాశాన్నంటి కొనుగోలు దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. అన్ని రకాల కూరగాయలు, దుంపలు, ఆకుకూరల ధరలు చూసి కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. సోమవారం ఉంగుటూరులోని వారపు సంతకు వచ్చి ఎన్నో రకాల కూరగాయలు తీసుకు వెళదామనుకున్న వినియోగదారులు వాటి ధరలు చూసి అవాక్కయ్యారు.దీంతో చేసేదేమీ లేక కొన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. కాయగాయల ధరలు రోజు రోజుకూ కొండెక్కుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలను చూస్తేనే ప్రజల గుండె గుభేలుమంటోంది. వాటి ధరలు ఒక్కసారిగా రెండింతలు పెరగడంతో ఏం కొనలేక పోతున్నామని వినియోగదార్లు అల్లాడుతున్నారు.కూరగాయలు కిలో ధర రూ.80 పైనే పలుకుతోంది.

భగ్గుమంటున్న పప్పు దినుసుల ధరలు

పప్పు దినుసులు ధరలు కూడా భగ్గుమంటున్నాయి. ఎండాకాలం కారణంగా దిగుబడి లేదంటూ వ్యాపారులు అధిక ధరలకు పప్పు దినుసులు, కూరగాయలు విక్రయిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా కూరగాయలు, ఆకు కూరల దిగుబడి ఈ ఏడాది తగ్గిందని రైతులు అంటున్నారు. దూబచర్ల, పుల్లలపాడు, నల్లజర్ల, ఆవుపాడు, డి.తురుమల, భీమడోలు, ఉంగుటూరు మండలంలోని మెట్ట ప్రాంతం నుంచి కాయగూరలు మార్కెట్‌కు వస్తుంటాయి. ఈ ఏడాది మార్కెట్‌కు తక్కువ సరుకు రావడంతో ధరలు అమాంతంగా పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. ఉల్లిపాయలు కిలో రూ.40 పలికింది. బంగాళాదుంపలు కిలో రూ.60, పచ్చిమిర్చి రూ.100, టమాటా రూ.60, ఒక ములక్కాడ రూ.10, బీరకాయల ధర రూ.80 పలికింది. దొండ కాయలు, బెండకాయలు, క్యారెట్, వంకాయ ఇలా ప్రతి కూరగాయ ధర పెరిగిందని వినియోగదారులు అన్నారు. సూపర్‌బజార్లలోనూ ధరలు మండిపోతున్నాయి. చిత్తూరు, బెంగుళూరు, కర్నూలు, తమిళనాడు నుంచి కాయగాయలు దిగుమతి చేస్తుండటంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెప్పారు.

గుడివాకలంక సర్పంచ్ రాజీనామా

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం కొల్లేరు గ్రామం గుడివాకలంక సర్పంచ్ జయమంగళ ప్రభావతి రాజీనామా చేశారు. సోమవారం ఆమె తన భర్త, మాజీ ఎంపీపీ జయమంగళ రామారావుతో కలిసి జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీఓ చంద్రశేఖర్‌కు తన రాజీనామ పత్రాన్ని అందజేశారు. అనారోగ్య కారణాల రీత్యా సర్పంచ్ విధులు నిర్వహించలేకపోతున్నానని, ఇందులో ఎవ్వరి బలవంతం, ఒత్తిడి, ఆదేశాలు లేవని వివరించారు. త్వరితగతిన తన రాజీనామా ఆమోదించి, విధుల నుంచి తప్పించాలని కోరారు. అయితే సర్పంచ్ రాజీనామా వెనక గ్రామంలో టీడీపీ నాయకులు ఒత్తిడి, వేధింపులు ఉన్నాయని పలువురు చెప్పుకుంటున్నారు.

ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు రాజీనామా

ఏలూరు రూరల్ : ఏలూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం తన రాజీనామా పత్రాన్ని యార్డ్ అధికారులకు అందజేసి ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ యార్డ్‌లో కొత్త జంబోషెడ్డు నిర్మాణానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కోట్ల రూపాయలు మంజూరు చేసిందని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆళ్లనాని సహకారంతో యార్డ్‌లో జంబో షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో రైతులు, వ్యాపారులకు మేలు జరిగేలా అనేక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు.

దివంగత వట్టి వసంతకుమార్‌కు ఘన నివాళి



గర్భిణులకు పండ్లు, పౌష్టికాహారాన్ని అందించిన వట్టి వసంతకుమార్ అభిమానులు, యువకులు



రక్తదానం చేస్తున్న వసంత్‌కుమార్ అభిమానులు

భీమడోలు: ఉమ్మడి రాష్ట్ర మంత్రి, దివంగత వట్టి వసంతకుమార్ 71వ జయంతిని పురస్కరించుకుని సోమవారం భీమడోలు, పూళ్ల తదితర గ్రామాల్లో ఆయన అభిమానులు పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వసంతకుమార్ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారంతా కేక్ కట్ చేశారు. గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పూళ్ల పీహెచ్‌సీ, భీమడోలు సామాజిక కేంద్రాల్లోని రోగులకు పండ్లు, పౌష్టికాహారాన్ని అందించారు. భీమడోలు సంత మార్కెట్‌లో ఆధ్వానంగా ఉన్న మంచినీటి ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు పరిశుభ్రం చేసి రంగులు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమాల్లో ఆసుపత్రి సూపరిండెంటెంట్ సునీత, వర్ధినీడి సాయి, గుడివాడ సీతారామాంజనేయులు, కురెళ్ల నారాయణ స్వామి, కేసీరెడ్డి లక్ష్మణ్, తమ్మన రామకృష్ణ, వట్టి నారాయణ, పెద్దిరెడ్డి వెంకన్న, జి.పాండురంగారావు, గంటా లోకరాజు, శేఖర్, బొమ్ముప్రసాద్, దేశంశెట్టి సతీష్, గణేష్, బి.దుర్గాపల్లవి, కేడీపీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువత రక్తదానం

ఉంగుటూరు: మాజీ మంత్రి దివంగత వట్టి వసంతకుమార్ జయంతిని ఆయన అభిమానులు ఉంగుటూరులో సోమవారం ఘనంగా నిర్వహించారు. వసంత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు యువకులు రక్తదానం చేశారు. పంచాయతీ కమ్యూనిటీ హాలులో కేకు కట్ చేశారు. పేదలకు పండ్లు, పాలు పంచారు. వసంత్ యువసేన అధ్యక్షుడు ముత్యాల బాలాజీ, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యెట్గిన ఉమ, శ్రీకాంత్, బాజి, పాండ్రాకుల శ్రీను, ఆకుల శ్రీను, పెద్దిరెడ్డి వెంకన్న, కూన శ్రీరాములు, నక్కిరి పెద్దిరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు. సుమారు 40 మంది రక్తదానం చేశారు.

సీపీఎఫ్ కంపెనీ మూసివేత దారుణం



సీపీఎఫ్ కంపెనీ వద్ద ఉద్యోగుల ఆందోళనకు మద్దతు ప్రకటించిన సీఐటీయూ

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీ లాభాల బాటలో నడుస్తున్నా యాజమాన్యం అక్రమంగా కంపెనీని మూసివేసి ఉద్యోగులకు తీరని అన్యాయం చేసిందని సీఐటీయూ జిల్లా కమిటీ విమర్శించింది. సోమవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేవీఎస్ గోపాలన్ ఇతర నాయకులు సీపీఎఫ్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ సీఐటీయూ అండగా ఉంటుందని ప్రకటించారు. కంపెనీని వెంటనే తెరిపించడానికి కొత్తగా అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నించాలని ఆయన కోరారు. కంపెనీలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి ఉన్నత అర్హతలు ఉన్న ఎందరో ఉద్యోగులు ఈ పరిశ్రమను మూసివేయడంతో రోడ్డున పడ్డారని, ఉద్యోగ అర్హత వయస్సు దాటిపోయి వారంతా ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షలు సోమవారం ఐదోరోజు కూడా కొనసాగించారు. లాభాల్లో ఉన్న కంపెనీని అన్యాయంగా మూసివేసి తీరని అన్యాయం చేసిందని వారంతా నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.పెంటారావు, పి.గోవింద్, గుత్తుల శ్రీనివాస్, దండు రామలింగరాజు పాల్గొన్నారు.

నేడు జలజీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యటన

ఏలూరు రూరల్ : జలజీవన్‌మిషన్ కేంద్ర బృందం మంగళవారం ఏలూరు రూరల్ గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఏలూరు రూరల్ మండల ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి చెప్పారు. మంగళవారం ఉదయం బృందం సభ్యులు మల్కాపురం చేరుకుంటారని వివరించారు. జలజీవన్ మిషన్ నిధులతో ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో చేపట్టిన పనులను సభ్యులు పరిశీలిస్తారన్నారు. అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు నాణ్యత ప్రమాణాలు సైతం పరీక్షిస్తారన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ కే శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు వేర్వేరుగా రెండు వృత్తివిద్యా కోర్సులపై ఉచిత శిక్షణ అందించడానికి ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు జూట్ బ్యాగుల తయారీపై 13 రోజుల శిక్షణ ఉంటుందని, గ్రామీణ ప్రాంత యువకులకు రిఫ్రిజిరేషన్, ఎయిర్‌కండిషన్ మరమ్మతులపై 30 రోజుల శిక్షణ ఉంటుందన్నారు. 5వ తరగతి ఆపైన విద్యార్హత కలిగిన గ్రామీణ ప్రాంత యువతీ యువకులకు ఈ నెల 12వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. 19 – 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువతీ యువకులకు శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు 95027 23561, 99485 65256 నంబర్లో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు 3 కలర్ పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి



సచివాలయ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ షేక్ నూర్జహాన్

ఏలూరు టౌన్: ప్రభుత్వ పాలన మారిన నేపథ్యంలో ఏలూరు నగరంలోని సచివాలయ ఉద్యోగులు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ చెప్పారు. ఏలూరు నగర పాలక సంస్థ పాత కౌన్సిల్ హాలులో సోమవారం మధ్యాహ్నం వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమీక్షా సమావేశానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థలో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల బాధ్యత కీలకమైందని తెలిపారు. సచివాలయంలోని అన్ని విభాగాల సెక్రటరీలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. ప్రతి రోజూ సమయానికి విధులకు హాజరుకావడంతో పాటు సచివాలయ కార్యాలయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు తాము చేస్తున్న విధులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. నగర కమిషనర్ లేదా ఉన్నత అధికారులు అడిగిన సమాచారాన్ని తక్షణమే అందించేలా సిద్ధపడి ఉండాలని చెప్పారు. సచివాలయ సెక్రటరీలు, లబ్ధిదారులకు అవసరమైన సమాచారాన్ని అందించడంతో పాటు కొత్త లబ్ధిదారులకు దరఖాస్తుల ఆన్‌లైన్ సేవలను అందించేందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ప్రజలతో మర్యాదగా ప్రవర్తిస్తూ విధులను నిర్వర్తించాలని తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు మిగిలిన ఇతర విభాగాల సెక్రటరీలతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితులను తెలుసుకుంటూ వారికి సేవలందించాలని తెలిపారు. ప్రతిరోజూ విధిగా గంటకుపైగా ఫీల్డ్ వర్క్ చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులను గుర్తించి ప్రొటోకాల్ పాటిస్తూ అడిగిన సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, నగర కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, అదనపు కమిషనర్ జీ.చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, సెక్రటరీ దివ్యకుమారి, 79 సచివాలయాల అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు హాజరయ్యారు.

మానవత సంస్థ సేవలు విస్తృతం



బావాయిపాలెంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిడమర్రు: మానవత ద్వారా అందిస్తున్న సామాజిక సేవలు మారుమూల పల్లెలకు, నిరుపేదలకు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మానవత జిల్లా మాజీ అధ్యక్షుడు సాగిరాజు జానకిరామరాజు అన్నారు. సోమవారం నిడమర్రు మండలం బావాయిపాలెంలో మానవత ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి కంటి పరీక్షలు చేసి 50 మందికి అవసరమైన మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సీనియర్ సభ్యుడు వెల్లంకి నరేష్, మండల మానవత అధ్యక్షుడు నౌడు అచ్యుతరామారావు, కోశాధికారి కాన్వెంట్ శ్రీను, సభ్యులు ముత్యాల చినసత్యనారాయణ, కూర్మాల నాగు, గొట్టుముక్కల విశ్వనాథరాజు, బువ్వనపల్లి సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, నిడమర్రు మండల ఉపాధ్యక్షుడు సమయం వీరరాఘవులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలకు వేతన బకాయిలు విడుదల చేయాలి



డ్వామా పీడీ ఏ.రాముకి వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. పోలవరం నిర్వాసితులకు, కొల్లేరు పేదలకు అదనంగా ఉపాధిపనులు కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఉపాధి హామీ కార్యాలయంలో పీడీ ఏ.రాముకి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఉన్న 27 మండలాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. సుమారు 15 మండలాల్లో ఈ సమస్యలతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చట్ట ప్రకారం ప్రతివారం కూలీలకు ఎంత వేతనం వస్తుందనేది ప్లే సిప్పుల ద్వారా తెలుస్తుందన్నారు. కానీ జిల్లాలో ఏ మండలంలోని ఉపాధి కూలీలకు ప్లే స్లిప్పులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. పనిచేసిన మూడు నుంచి ఆరు వారాలకు సంబంధించిన వేతనాలు అందక కూలీలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. పని దినాలు పెంచాలని అడిగిన సందర్భంలో మండల స్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగే చోట్ల ప్రాథమిక చికిత్స నిమిత్తం ఇవ్వాల్సిన మెడికల్ కిట్లు ఇవ్వకపోవడంతో పని ప్రదేశం నుంచి 5 నుంచి 10 కిలోమీటర్లు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చాట్రాయి మండలంలో కూలీల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. ఏలూరు నగరంలో విలీనం చేసిన 7 గ్రామ పంచాయతీల్లో ఉన్న పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కూలీలకు మెడికల్ కిట్లు, మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేయాలని కోరారు. దీనిపై డ్వామా పీడీ రాము మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఇచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడాలి



యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థను నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కాపాడాలని, వెంటనే 117 జీవోను రద్దు చేయాలని యూటీఎఫ్ ఏలూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. యూటీఎఫ్ ఏలూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం సోమవారం స్థానిక ఏలూరు యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా అలీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వంపై విద్యావ్యవస్థను బాగుచేసే బాధ్యత ఉందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవి కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పాఠశాల విద్యను, ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బీ సుభాషిణి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ శ్యాంబాబు, జిల్లా సహాధ్యక్షుడు జీ వేంకటేశ్వరరావు, కోశాధికారి జీవీ రంగమోహన్, కార్యదర్శులు ఏ.విక్టర్, అల్లాడి రాజు, బీ అనురాధ, ఎస్.రాంబాబు, పీ శ్రీనివాస్, ఎస్.సుధారాణి పాల్గొన్నారు.

అమెరికాలో కేవీఎస్‌కు సన్మానం



అట్లాంటాలో కేవీ సత్యనారాయణను సన్మానిస్తున్న ఆటా ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ సినీ నృత్య దర్శకుడు, కళారత్న కేవీ సత్యనారాయణకు అమెరికాలో ఘన సన్మానం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ఏలూరులో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికాలోని అట్లాంటా నగరంలో అమెరికా తెలుగు సంఘం ఆటా ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకూ జరిగిన ఆటా సాంస్కృతిక సంబరాల్లో భాగంగా కేవీఎస్ బృందం గోదా కళ్యాణం నృత్య రూపకాన్ని విజయవంతంగా ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనకు అక్కడి తెలుగు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. ఈ సంబరాల్లో భాగంగా అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో నిర్వహించిన శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి అట్లాంటాలో నిర్వహించిన ఫైనల్స్ పోటీకి తాను న్యాయనిర్ణేతగా వ్యవహరించానని తెలిపారు. ఈ సందర్భంగా ఆటా కన్వీనర్, సభ్యులు సత్కరించినట్లు కేవీఎస్ తెలిపారు.

ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలి



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, కౌలురైతులు

ఏలూరు (టూటౌన్): ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం, ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ ముందు రైతులు, కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ధాన్యం సొమ్ములివ్వకపోతే సార్వా సాగు చేయలేమంటూ రైతులు కలెక్టరేట్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రబీ ధాన్యం రైతులు, కౌలు రైతులు అమ్మి 40 రోజులు దాటిపోతున్నా ధాన్యం సొమ్ములు చెల్లించకపోవడం అన్యాయమని విమర్శించారు. ఎన్నికల ముందు మాత్రం రెండు మూడు రోజులకే చెల్లించి ఎన్నికల అనంతరం పౌర సరఫరాల శాఖ చేతులెత్తేయడంతో అన్నదాతలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు రూ.200 కోట్లు ధాన్యం బకాయి సొమ్ములు రైతులకు, కౌలు రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. ఖరీఫ్ సాగు సమయం ముందుకు రావడంతో విత్తనాలు కొనుగోలు చేయడానికి కూడా చేతిలో పెట్టుబడికి సొమ్ములు లేక అన్నదాతలు అల్లాడిపోతున్నారన్నారు. రబీ పంట సాగు పెట్టుబడి అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయన్నారు. ధాన్యం బకాయి సొమ్ములను వెంటనే చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు.